క్లుప్తంగా

మార్మోగిన రామనామస్మరణ



కూడేరు: విశేష అలంకరణలో సీతారాములు

కూడేరు: కూడేరులోని కోదండ రామాలయం శనివారం సీతారాముల నామస్మరణతో మార్మోగింది. సీతారాములకు ఆలయ అర్చకులు భాస్కర్ శర్మ క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలతో అలంకరణ చేశారు. ఈ పూజల్లో పెద్ద ఎత్తున పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా ఉదయ్ భాస్కర్

కూడేరు: డిప్యూటీ తహసీల్దార్‌గా ఉదయ్ భాస్కర్‌ను ఉన్నతాధికారులు నియమించారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్ బదిలీపై శింగనమల మండలానికి బదిలీపై వెళ్లారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



కూడేరు: మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ శ్రీదేవి

కూడేరు: ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. శనివారం కడదరకుంటలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్‌వైజర్ అరుణ సురేఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనుల విందుగా పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న శ్రీదేవి భూదేవి సమేత నృసింహస్వామి

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం నృసింహస్వామి పల్లకీ సేవ శనివారం కనుల విందుగా జరిగింది. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అందంగా వివిధ పుష్పాలతో అలంకరించిన పల్లకీలో శ్రీదేవి భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవ మూర్తులను ఉంచి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామికి ఏకాదశి పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. శనివారం తెల్లవారుజామున ప్రత్యేక జలంతో స్వామికి వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక అభిషేకం చేసి, స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ మహామంగళహారతి తదితర పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



శ్రీధరఘట్టలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్

బొమ్మనహాళ్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ విజయభాస్కర్ అన్నారు. శనివారం శ్రీధరఘట్ట, నేమకల్లు, బొమ్మనహాళ్ తదితర గ్రామాల్లో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున, డాక్టర్ కుమారరాజా, ఈఓపీఆర్డీ దాస్, సర్పంచ్ పరమేశ్వర పాల్గొన్నారు.

సిబ్బంది కొరత.. రోగులకు వ్యథ

- రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో వైద్యం దైవాధీనం
- ముగ్గురు స్పెషలిస్ట్ వైద్యుల బదిలీ
- 23 పోస్టులకు గాను నలుగురితో నెట్టుకురావాల్సిన పరిస్థితి



రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రి



ఓపీలో చికిత్స పొందుతున్న రోగులు

రాయదుర్గంటౌన్: వైఎస్సార్‌సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి ప్రాధాన్యత ఇచ్చారు.. గ్రామీణ ప్రాంతాల్లోనూ కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు ఎక్కడికక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అత్యవసర చికిత్సలకు సిఫార్సు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వైద్యం దైవాధీనంగా మారింది. సిబ్బంది కొరత వేధిస్తోంది. అరకొర సిబ్బందితోనే అష్టకష్టాలు పడుతూ సేవలు కొనసాగించాల్సి వస్తోంది. రాయదుర్గంలోని ఏరియా ప్రభుత్వాస్పత్రిలో సివిల్ సర్జన్‌లు, డిప్యూటీ సివిల్ సర్జన్‌లు, జనరల్ మెడిషన్ విభాగాల్లో మొత్తం 23 మంది వైద్యులకు గాను ఇప్పటి దాకా కేవలం 8 మందితో నెట్టుకొస్తుండేవారు. వైద్యుల పోస్టుల భర్తీ చేసే మాట అటుంచితే.. పనిచేస్తున్న వైద్యుల్లోనూ తాజాగా మరో ముగ్గురు స్పెషలిస్ట్ వైద్యులు ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. ఇక మిగిలింది ఐదురుగు మాత్రమే. వీరిలోనూ ఒక వైద్యురాలు దాదాపు ఆరు నెలల నుంచి మెడికల్ లీవ్‌పై ఉన్నారు. ఇక నలుగురు వైద్యులతో వైద్య సేవలు ఏ విధంగా అందుతాయో అర్థం కాని పరిస్థితి. ఈ నలుగురు వైద్యుల్లోనూ ఒకరు డెంటిస్ట్ కాగా మరొకరు కంటి వైద్య నిపుణురాలు ఉన్నారు. మిగిలిన ఇద్దరు గైనకాలజిస్టులు ఉన్నారు. వీరిపైనే ఇక మొత్తం పని భారం పడనుంది.మరోవైపు వైద్యుల పోస్టులతో పాటు స్టాఫ్ నర్సుల కొరత కూడా తీవ్రంగా ఉంది. మొత్తం 24 నర్సు పోస్టులకు గాను ప్రస్తుతం 9 మంది మాత్రమే పని చేస్తున్నారు. అడ్మినిస్ట్రేషన్ విభాగంలో కూడా సిబ్బంది కొరత వేధిస్తోంది.

బదిలీ అయిన స్పెషలిస్ట్ వైద్యులు వీరే:

రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న స్పెషలిస్ట్ వైద్యులు, ఆస్పత్రి సూపరింటెంటెంట్ మెర్సీ జ్ఞానసుధ ఏరియా ఆస్పత్రి ఎమ్మిగనూరుకు, చిన్న పిల్లల వైద్య నిపుణుడు ఉమామహేశ్‌కుమార్ ఏరియా ఆస్పత్రి కదిరి, అసిస్టెంట్ సివిల్ సర్జన్ మోహన్‌సాయి చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. మెర్సీ జ్ఞానసుధ బదిలీతో మెడికల్ సూపరింటెంటెంట్‌గా గైనాకాలజిస్ట్ మాధవికి బాధ్యతలు అప్పగించినట్లు అడ్మినిస్ట్రేటివ్ అధికారి మెహబూబ్‌బాషా తెలిపారు.

వైద్య రంగం నిర్వీర్యం..

ముఖ్యంగా నైట్ డ్యూటీల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వైద్యం రంగం పూర్తిగా నిర్వీర్యమైంది. సిబ్బంది కొరత, రోగుల వ్యథ అన్నట్లుంది ఏరియా ఆస్పత్రిలో పరిస్థితి. ఇన్నీ రోజులు ఏరియా ఆస్పత్రిలో ఖాళీ పోస్టులను భర్తీ చేసే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని చెప్పిన జిల్లా వైద్యశాఖ అధికారులు పోస్టులను భర్తీ చేయకపోగా పనిచేస్తున్న వైద్యులను కూడా బదిలీ చేయడంతో రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పోస్టులను భర్తీ చేసి మెరుగైన వైద్య సేవలు అందించే విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుండడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

రోజూ 400 మందికి ఓపీ సేవలు

ఏరియా ఆస్పత్రికి పట్టణంతోపాటు పరిసర మండలాల్లోని గ్రామాల నుంచి రోజుకు దాదాపు 400 మందికిపైగా ఓపీలో వైద్య సేవల కోసం వస్తున్నారు. 50 మందికిపైగా అడ్మిషన్‌లో ఉంటారు. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యుల కొరత కారణంగా ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందక అవస్థలు పడుతున్నారు. అత్యవసర కేసుల్లో వైద్యుల ఇబ్బందులు మరింత అధికంగా ఉంటున్నాయి. వీధుల్లో ఉన్న డాక్టర్లపై పని ఒత్తిడి తీవ్రంగా ఉంటుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులతో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సేవలు మృగ్యమయ్యాయి.

23న యువత పోరును విజయవంతం చేద్దాం



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో యువత పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈనెల 23న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న 'యువతపోరు'ను విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయం ఎదుట యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో నిరుద్యోగుల పక్షాన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రం కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా నిరుద్యోగులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి కాశీరాం, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెర్లోపల్లి ప్రకాష్, జిల్లా జనరల్ సెక్రటరీలు సురేష్, తలారి శ్రీకాంత్, జిల్లా సెక్రటరీ ఎర్రంపల్లి కృష్ణమూర్తి, మండల కన్వీనర్ గోళ్ల సూరి, మండల ఉపాధ్యక్షుడు మల్లాపురం మల్లి, యూత్ అధ్యక్షులు చరణ్, టౌన్ వింగ్ ఓంప్రకాష్, శెట్టూరు మండల యూత్ అధ్యక్షులు లక్ష్మణమూర్తి, నాయకులు మాజీ వక్ఫ్‌బోర్డు సభ్యులు షేక్షా, దొడగట్ట మురళి, మోహన్, మల్లి, నాగరాజు, వెంకటేష్, జాకీర్, ఇబ్రహీం, నల్లప్ప, దేవా, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన



అతిసార వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి కుమారరాజా

బొమ్మనహాళ్: అతిసార వ్యాధి ప్రమాదకరమని, ప్రతి ఒక్కరూ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి కుమారరాజా తెలిపారు. శనివారం మండలంలోని శ్రీధరఘట్ట పీహెచ్‌సీలో అతిసార వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. డాక్టర్ మాట్లాడుతూ అతిసారం నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఆదోని ఎమ్మెల్యేపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఉరవకొండ: ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత, గిరిజనుల హక్కుల సాధన సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మీనుగ గోపాల్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఓ దళిత సర్పంచ్‌ను తీవ్రంగా కించపరిచి మాట్లాడటంపై దళిత సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. దళిత సంఘం నాయకులు గోపాల్, సర్పంచ్ జగదీష్, మాజీ ఎంపీపీ తిప్పయ్య మాట్లాడుతూ ఆదోని ఎమ్మెల్యే పార్థసారథితో పాటు సభా వేదికపై ఉన్న వారందరూ దళిత సర్పంచ్‌ను కించపరిచేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఎమ్మెల్యేతో పాటు దళిత సర్పంచ్‌ను అవమానించి మాట్లాడిన వారిందరి పై కేసులు నమోదుల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు ఎర్రిస్వామి, ఓబయ్య, పురుషోత్తం, రమేష్, నగేష్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ ఏపీఓగా సుజాత

ఉరవకొండ రూరల్: ఉపాధి హామీ ఏపీఓగా సుజాత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఆత్మకూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న విమల వజ్రకరూరుకు బదిలీపై వెళ్లారు.

రోడ్లు అధ్వానం.. అవస్థల ప్రయాణం



కంకర తేలి అధ్వానంగా ఉన్న వి.కొత్తకోట రహదారి

విడపనకల్లు: మండలంలోని గ్రామీణ రహదారులన్నీ అధ్వానంగా ఉన్నాయి. మండల పరిధిలోని వి.కొత్తకోట గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా కంకర తేలింది. కనీసం ద్విచక్రవాహనాలు కూడా రాకపోకలకు వీలు లేనంతగా గుంతలు పడింది.ఈ రోడ్డు గుండా వెళ్లే కొత్తకోట ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాల్తూరు, హావళిగి,ఉండబండ పాల్తూరు గ్రామాల మధ్య రోడ్డు కూడా పూర్తిగా ఛిద్రమైంది. వాహనాల రాకపోకలకు అంతారాయంగా ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడతున్నారు. అధికారులు,ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డును మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

అన్నదాత సుఖీభవ వర్తింపజేయండి



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశులు

విడపనకల్లు: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని కౌలు రైతు సంఘం జిల్లా నాయకుడు బోయ వెంకటేశులు, కౌలు రైతులు తిప్పయ్య, అంజనయ్య, చీకలగురికి ఓబుళేసు కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. కూటమి అధికారంలోకి రావడానికి సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి, ఇంత వరకూ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రైతులకు ఏటా అన్నదాత సుఖీభవ స్కీం కింద రూ.20వేలు ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఖరీఫ్ ప్రారంభమై, వ్యవసాయ పనులు మొదలైనా ఇంత వరకూ పైసా కూడా ఇవ్వలేదన్నారు. కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ వర్తింపజేసి, వారికి కూడా పంట పెట్టుబడి సాయం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కౌలు రైతులు నాగరాజు, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: చౌక డిపో డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి రేషన్ సక్రమంగా అందించాలని తహసీల్దార్ మునివేలు తెలిపారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో చౌక దుకాణాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపులను తెరిచి, కార్డుదారులకు అందుబాటులో ఉంచాలన్నారు. వృద్ధులకు 5వ తేదీలోపు బియ్యం ఇళ్లకు వెళ్లి అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ బాలకృష్ణ, డీలర్ల సంఘం అధ్యక్షుడు పయ్యావుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులు కండీషన్‌లో పెట్టుకోవాలి



కొకుంట్ల-సొల్లాపురం క్రాస్ వద్ద స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

ఉరవకొండ: మండలంలో కొన్ని ప్రైవేట్ పాఠశాలల బస్సులు కండీషన్ లేకున్నా యజమాన్యం వాటినే రూట్లకు తిప్పుతున్నారని, అలాంటి వాహనాలను గుర్తించి ఆర్‌టీఓకు అప్పగించి సీజ్ చేయిస్తామని ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు హెచ్చరించారు. శనివారం కొకుంట్ల సొల్లాపురం క్రాస్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. రికార్డులు సరిగా లేని వాహనాలకు జరిమానా విధించారు. స్కూల్ బస్సులు కూడా కండీషన్‌లో ఉంచుకోవాలన్నారు. బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించి, కండీషన్‌లో ఉంచుకోవాలన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



రాయదుర్గంలో యోగా చేస్తున్న దృశ్యం



ఉరవకొండలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం



బొమ్మనహాళ్: యోగాంధ్ర అక్షరాకారం

రాయదుర్గం: రోజూ యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. జూనియర్ కళాశాల మైదానంలో సామూహిక యోగాసనాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్ రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివ, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో యోగా గురువులు వెంకట్ తాడికొండ, నాగమల్లి ఓబులేస్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ ఆదినారాయణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

ఉరవకొండ రూరల్: నింబగల్లు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం విజయ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు.

కళ్యాణదుర్గం: మానవ జీవితానికి యోగా ఎంతో అవసరమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు.శనివారం స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో యోగా దినోత్సవం జరిగింది. ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, గ్రామాల్లో తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్, ఎంఈఓ మల్లికార్జున, పశువైద్యాధికారి వెంకటరెడ్డి, ఈఓపీఆర్డీ దాస్, ఆధ్వర్యంలో శనివారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

కూడేరు: మండల వ్యాప్తంగా ఎంపీడీఓ కుళ్లాయి స్వామి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు.

కూడేరు: స్థానిక ఎన్‌సీసీ నగర్‌లో ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ ఎంఎస్ కులకర్ణి ఆధ్వర్యంలో శనివారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

కణేకల్లు: ఎన్.హనుమాపురం, కణేకల్లులో శనివారం జరిగిన యోగా దినోత్సవంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, డీటీ విశ్వ నాథ్, సర్పంచు దంపతులు నిర్మల, డాక్టర్ సోమన్న, వీఆర్వో పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, మాజీ వైస్ సర్పంచు ఆనంద్‌రాజు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా తహసీల్దార్ రజాక్ వలి, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ రామచంద్ర, ఎంపీపీ భవాని, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు.

కుందుర్పి: కుందుర్పి, అపిలేపల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా యోగాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అతావుల్లా, ఉపాధ్యాయులు తిమ్మప్ప, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వజ్రకరూరు: కేవీజెడ్పీహెచ్ఎస్‌లో తహసీల్దార్ నరేష్‌కుమార్, ఎంపీడీఓ శివాజీరెడ్డి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. జిల్లా దేవదాయ శాఖ అద నపు అధికారి తిరుమలరెడ్డి, సర్పంచు మోనా లిసా, ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప,హెచ్ ఎం స్వర్ణలత, పాల్గొన్నారు. ఆదర్శ పాఠశాలలో సర్పంచు మోనాలిసా, ప్రిన్సిపాల్ గంగాధర్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ హర్షలత, ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీధర్, రవి, పీడీ జయరామప్ప పాల్గొన్నారు.

విడపనకల్లు: మండల వ్యాప్తంగా యోగా దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ షకీలాబేగం, సర్పంచులు, బీమ్లారాణి, చంద్రశేఖర్, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు కరణం భీంరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే వ్యర్థాలు



కణేకల్లు రోడ్డు మార్కెట్ యార్డు సమీపంలో గుట్టలుగా పడేసిన వ్యర్థాలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు మార్కెట్‌యార్డు సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాల నుంచి శానిటరీ, గృహ నిర్మాణ వ్యర్థాలు ఇక్కడికి తెచ్చి పడేస్తున్నారు. దుర్వాసన, దోమల బెడదతో పాటు వ్యర్థాలు రోడ్డు అంచు వరకు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమీపంలో అరబిక్ మదరసా కూడా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

జూద కేంద్రాలపై చర్యలు తీసుకోండి

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల, మలయనూరు, బెస్తరపల్లి, ఎనుములదొడ్డి పంచాయతీల్లో జరుగుతున్న పేకాటను అరికట్టాలని సర్పంచులు మమత, గోవిందమ్మ, గంగాధర, మహదేవమ్మ తదితరులు శనివారం ఎస్‌ఐ నగేష్‌కు ఫిర్యాదు చేశారు. పేకాట జోరుగా నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

వజ్రకరూరు: స్థానిక ఆదర్శ (మోడల్) పాఠశాల ప్రిన్సిపాల్‌గా జి.గంగాధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. విడపనకల్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర్ బదిలీలో భాగంగా వజ్రకరూరు మండలానికి వచ్చారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధితోపాటు విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

షాపు రూముల వేలం

రాయదుర్గంటౌన్: మున్సిపల్ కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏ, బీ, సీ బ్లాకులలో ఖాళీగా ఉన్న 6 షాప్ రూముల అద్దెకు గుడ్‌విల్ ప్రాతికదికన ఈ నెల 23న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 23న మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.3 లక్షల విలువైన సాల్వెన్సీ సర్టిఫికెట్, రూ.2 లక్షల గుడ్‌విల్ ను చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

ఉన్నత లక్ష్యం చేరుకోవాలి



విద్యార్థులకు కిట్లు అందిస్తున్న సర్పంచు మల్లెల జగదీష్

వజ్రకరూరు: విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సర్పంచు మల్లెల జగదీష్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పూసల నరేష్ తదితరులు కోరారు. శనివారం మండలంలోని చాబాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్, ఉపాధ్యాయులు రాజేష్, శ్రీధర్, దేవేంద్ర, రాము, గిరి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని బాలుడి అప్పగింత

గుమ్మఘట్ట: మతిస్థిమితం లేని బాలుడు మల్లన్నగౌడ్‌ను అతని తల్లిదండ్రులు ఆనంద్,నేత్రావతికి పోలీసులు శనివారం అప్పగించారు. గోనబావిలో మతిస్థిమితం లేని బాలుడు తచ్చాడుతుండగా, గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. బాలుడి ఫొటోను అన్ని పోలీస్ స్టేషన్లు, సరిహద్దున ఉన్న పోలీస్ స్టేషన్లకు చేరవేశారు. కర్ణాటకలోని విజయనగరం జిల్లా కూడ్లిగి తాలుకా కుదురెడువుకు చెందిన ఆనంద్,నేత్రవతి కుమారుడు మల్లన్నగౌడ్‌గా పోలీసులు గుర్తించారు.బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ రఘు తెలిపాడు.

ఆసనం..ఆపసోపాలు



యోగాసనాలు వేసేందుకు తిప్పలు పడుతున్న నేతలు

కళ్యాణదుర్గం: యోగా సాధనతో ఆరోగ్యం.. యోగా నిత్య జీవితంలో భాగం కావాలి.. ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవర్చుకోవాలి.. ఇవీ నెల రోజులుగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఊరూరా ఊదరగొడుతున్నారు. అయితే శనివారం దేశవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకున్నారు. శనివారం స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన యోగా దినోత్సవంలో కూటమి నేతలు యోగా చేసేందుకు ఆపసోపాలు పడ్డారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు యోగా చేస్తున్న సమయంలో ఇరువైపులా ఉన్న నేతలు యోగాసనాలు చేసేందుకు ముప్పుతిప్పలు పడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లుగానే అలవాటు ఉన్న వాళ్లు యోగాకు రావాలని లేకపోతే మీడియా కంట పడతారని చెప్పిన విధంగానే.. కళ్యాణదుర్గంలో ఒక్కో నేత ఒక్కో స్టైల్లో యోగా చేస్తూ ఇలా నవ్వులపాలయ్యారు. కొందరైతే ఆసనాలు చేయడం మరిచి ఏకంగా కింద పడుకొని నవ్వుకుంటూ కనిపించారు.